క్లుప్తంగా

బాధితులకు చేయూత



ఖాసీంపేటలో బియ్యం అందజేస్తున్న పద్మశాలీ సంఘం సభ్యులు

గన్నేరువరం: ఖాసీంపేట, జంగపల్లి గ్రామాలకు చెందిన గుర్రం రమేశ్, వెంగళ రాజవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. వారి కుటుంబ సభ్యులను గురువారం పద్మశాలీ సంఘం సభ్యులు పరామర్శించారు. 25 కిలోల చొప్పున బియ్యం అందజేశారు. గుంటుక లింగయ్య, బూర శ్రీనివాస్, డాక్టర్ నర్సయ్య, ఆడెపు శ్రీనివాస్, గుంటుక రంగయ్య, ఆంజనేయులు, రవి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



మానకొండూర్: కొండపల్కల గ్రామానికి చెందిన రేవేని రాజయ్య కుమారుడు సాయిచరణ్ కాళ్లు చచ్చుబడిపోగా.. బీజేపీ తరఫున నాయకులు గురువారం రూ.5వేలు అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు, ఎంపీటీసీ గుర్రాల వెంకటరెడ్డి, కార్యవర్గ సభ్యులు రావుల శంకరాచారి, దూలం కిరణ్‌గౌడ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు అడప రవి, సైండ్ల పురుషోత్తం తదితరులున్నారు.

రేపు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

చొప్పదండి: గుమ్లాపూర్ గ్రామంలో ఈనెల 11న వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శనివారం మహా గణపతి పూజ, అగ్ని ప్రతిష్ఠ, ఆదివారం ఉదయం స్వామివారి మూల విరాట్‌కు అభిషేకం, అనంతరం గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం స్వామివారి పల్లకి సేవ, రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రోటిగూడకు చెందిన మౌనస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేత్రపర్వంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

శంకరపట్నం: మండల కేంద్రంలో గురువారం వేంకటేశ్వరస్వామి కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ అర్చకుడు రామానుజాచార్యులు స్వామివారి కల్యాణ తంతును నిర్వహించారు. కేశవపట్నం గ్రామస్తులు పాల్గొన్నారు.

హద్దురాళ్ల తొలగింపు



జమ్మికుంట: రామన్నపల్లి పరిధిలోని సర్వే నంబర్ 405/సీలో అక్రమ లేవుట్ హద్దురాళ్లను మున్సిపల్ అధికారులు గురువారం తొలగించారు. కమిషనర్ అయాజ్ మాట్లాడుతూ.. మున్సిపల్ అనుమతులు పొందిన తర్వాతే లేఅవుట్లు ఏర్పాటు చేసుకొని విక్రయాలు చేయాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో ఇంటి అనుమతులు, రోడ్లు, తాగునీటి వసతులు, డ్రైనేజీల నిర్మాణ సమస్యలు తలెత్తుతాయన్నారు. అనుమతి లేని లేఅవుట్లపై చర్యలు తీసుకుంటామని అన్నారు. టీపీవో శ్రీధర్, టీపీఎస్ ప్రదీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పలువురిపై కేసు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ఓ భవనంలో రాజకీయ విందుపై పలువురిపై గురువారం కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్ తెలిపారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, నాయకుడు వర్ధినేని రవీందర్‌రావుతోపాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఓటు.. మన హక్కు

కరీంనగర్ అర్బన్: ఓటు.. మన హక్కు అని, ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కళాజాత బృందాలు గురువారం కరీంనగర్ ప్రయాణ ప్రాంగణంలో అవగాహన కల్పించారు. పోలింగ్ తేదీ గురించి పాటలు, మాటల ద్వారా వివరించారు. ఈ నెల 13 సెలవు దినం కాదని, మన భవిష్యత్తును నిర్దేశించుకునే రోజని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటర్లు విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల్లో అక్రమాలకు అరికట్టడానికి తమ వంతు పాత్రగా పౌరులు సీ విజిల్ యాప్, 1950 టోల్ ఫ్రీ నంబరును ఉపయోగించాలని కోరారు. స్వీప్ నోడల్ అధికారి, ఎన్.రామానుజచారి, మెప్మా పీడీ బి.రవీందర్ పాల్గొన్నారు.

వైద్యాధికారి కావలెను..



మానకొండూర్ ప్రభుత్వ ఆసుపత్రి



మానకొండూర్‌లో వైద్య సేవలందిస్తున్న పల్లె దవాఖాన వైద్యురాలు

- ఆరు నెలలుగా రోగులకు తప్పని తిప్పలు
- వంతులవారీగా సేవలందిస్తున్న పల్లె దవాఖాన వైద్యులు

మానకొండూర్: నియోజకవర్గ కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిలో వైద్యాధికారి లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నెలలుగా వైద్యాధికారి లేక ఇబ్బందులు పడుతున్నా.. ఉన్నతాధికారులు మాత్రం వైద్యాధికారిని నియమించడం లేదు. సమీప పల్లె దవాఖానలో విధులు నిర్వహిస్తున్న వైద్యులే వంతులవారీగా విధులు నిర్వహించాలనే ఆదేశాలుండటంతో.. రెండు రోజులకోమారు పల్లె దవాఖానల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు మానకొండూర్ ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది.

నెలలు గడిచినా..

నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రికి చుట్టుపక్కల గ్రామాలతోపాటు మానకొండూర్ గ్రామస్తులు ప్రతిరోజు వందకు పైగా వస్తుంటారు. సోమ, శుక్రవారం ఎక్కువగా వస్తుంటారు. వీరందరికి వైద్యాధికారి వైద్య పరీక్షలు నిర్వహించి సేవలందించాల్సి ఉండగా.. వైద్యాధికారి లేక తిప్పలు పడుతున్నారు. 2023 నవంబర్‌లో వేణుగోపాల్ అనే వైద్యాధికారి డిప్యూటేషన్‌పై వచ్చి కొన్నాళ్లు విధులు నిర్వహించి మళ్లీ బదిలీపై వెళ్లిపోయారు. అప్పటి నుంచి సమీప పల్లె దవాఖానల వైద్యులే మానకొండూర్‌లోని ఆసుపత్రిలో వైద్య సేవలందించాలని ఉన్నతాధికారుల ఆదేశాలున్నాయి. దీంతో మండలంలోని వివిధ గ్రామాల పల్లె దవాఖానల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులే రెండు రోజులకోసారి మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తూ రోగులకు వైద్య సేవలందిస్తున్నారు. నెలలు గడిచినా వైద్యాధికారిని నియమించక కాలం వెల్లదీస్తుండటంతో.. వైద్యులు అందుబాటులో ఉండటం లేదనే అపవాదు మూటగట్టుకుంటున్నారు. ఇప్పటికయినా మానకొండూర్ ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యాధికారిని నియమించాలని మండల వాసులు డిమాండ్ చేస్తున్నారు.

బీజేపీలోకి బీఆర్ఎస్ యువజన నాయకులు



చొప్పదండి: పట్టణానికి చెందిన బీఆర్ఎస్ యువజన నాయకులు గురువారం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. గతంలో ఏబీవీపీ, బీజేవైఎం నాయకులుగా సుదీర్ఘ కాలం పార్టీలో కొనసాగిన యువకులు.. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌లో చేరారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సుమారు 50మంది యువకులు తిరిగి బీఆర్ఎస్ నుంచి బీజేపీ గూటికి చేరారు. మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, చేపూరి సత్యనారాయణ, బత్తిని ప్రశాంత్, శ్రవణ్, శివశంకర్, సమరసింహారెడ్డి, కుమార్, సుధాకర్, అనూష్, కళ్యాణ్, రంజిత్ పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐని అభినందించిన 'బండి'



చొప్పదండి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీకి మద్దతుగా ప్రచారం నిర్వహించడానికి వచ్చిన చొప్పదండికి చెందిన ఎన్ఆర్ఐ గుర్రం వంశీధర్‌రెడ్డిని బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ గురువారం అభినందించారు. ఎన్నికల్లో బీజేపీని బలపరచాలని ఆయన వారం రోజులుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీకి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తూ ఓటేయడానికి వచ్చిన వంశీధర్‌రెడ్డిని స్థానిక బీజేపీ నాయకులు బండి సంజయ్‌కి పరిచయం చేశారు. ఖండాంతరాల్లో మోదీకి అభిమానులున్నారని, ఈ అభిమానం ఇలాగే కొనసాగాలని ఆయన కోరారు. బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

చిత్ర కథ



ప్రమాదకరంగా కరీంపేట బ్రిడ్జి

శంకరపట్నం: కరీంపేట బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. ఎస్సారెస్పీ కాలువపై కేశవపట్నం-కరీంపేట గ్రామాలకు రాకపోకల నిమిత్తం ఈ బ్రిడ్జిని నిర్మించారు. బ్రిడ్జి రేలింగ్‌లు విరిగిపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రేలింగ్ మరమ్మతు పనులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద క్యూలైన్‌లో శిక్షణ కానిస్టేబుళ్లు

ఓటేసిన శిక్షణ కానిస్టేబుళ్లు

వారంతా కొత్తగా ప్రభుత్వ కొలువులో చేరారు. శాంతిభద్రతల రంగంలో కానిస్టేబుళ్లుగా ఎంపికవగా శిక్షణలో ఉన్నారు. ఎన్నికల క్రమంలో విధులు కేటాయించగా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఓటు తమ హక్కుగా బారులు తీరారు. గురువారం నగరంలోని ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటుహక్కును వినియోగించుకున్నారు.

– కరీంనగర్ అర్బన్



ఓటేస్తూ..

కాంగ్రెస్‌లో చేరికలు

వీణవంక: కిష్టంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సిద్దిపల్లి మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్ హుజూరాబాద్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తకు దక్కిన అరుదైన గౌరవం



మోదీకి నమస్కరిస్తున్న వెంకట్‌రెడ్డి

శంకరపట్నం: కొత్తగట్టుకు చెందిన మాడ వెంకట్‌రెడ్డి బీజేపీలో సాధారణ కార్యకర్తగా తన రాజకీయ జీవితం మొదలుపెట్టారు. 23 సంవత్సరాల్లో అంచెలంచెలుగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. బుధవారం ఆయనకు వేములవాడలో అరుదైన గౌరవం దక్కింది. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన ప్రధాన మంత్రి మోదీకి స్వాగతం పలుకుతూ నమస్కారం చేయగా.. మోదీ ఆయనకు ప్రతి నమస్కారం చేశారు. దీంతో అరుదైన గౌరవం దక్కిందని సోషల్ మీడియాలో తన ఆనందాన్ని పంచుకున్నారు. వెంకట్‌రెడ్డి రెండు పర్యాయాలు మండలం నుంచి జెడ్పీటీసీగా పోటీ చేశారు.

మోదీని కలిసిన జీడీ మల్లేశ్



జమ్మికుంట: వేములవాడలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన ప్రధాని మోదీని హెలీప్యాడ్ వద్ద జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేశ్ కలిసి స్వాగతం పలికారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మోదీని కలిసినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ అవకాశం కల్పించిన ఎంపీ బండి సంజయ్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

క్వింటాల్ పత్తి రూ.7,050



వేలంలో పాల్గొన్న వ్యాపారులు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్లో క్వింటాల్ పత్తి గరిష్టంగా రూ.7,050 పలికింది. గురువారం మార్కెట్‌కు 13 వాహనాల్లో 134 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు. మోడల్ ధర రూ.6,900, కనిష్ట ధర రూ.6,600కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. యార్డులో క్రయవిక్రయాలను కార్యదర్శి గుగులోతు రెడ్డి నాయక్ పర్యవేక్షించారు.

'ఎన్ని ఆలయాలకు నిధులు తెచ్చారో చెప్పాలి'

కరీంనగర్ కార్పొరేషన్: దేవుని పేరుతో ఓట్లడిగే ఎంపీ బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఎన్ని దేవాలయాలకు నిధులు తెచ్చారో చెప్పాలని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

బీఆర్ఎస్ అభ్యర్థికే ఓటేయాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్



నవాబుపేట్‌లో ప్రచారం చేస్తున్న ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి

గంగాధర: ఓటేయడానికి ఆగం కావద్దు.. అభివృద్ధి చేసే బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌కే ఓటేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. ఆచంపల్లి గ్రామంలో గురువారం ఉపాధి హామీ కూలీలతో పని చేసి వారితో మాట్లాడారు. నాయకులు వేముల దామోదర్, కంకణాల విజయేందర్‌రెడ్డి, గంగాధర్, మధుసూదన్, సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం తదితరులున్నారు.

చిగురుమామిడి: పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపిస్తేనే ప్రభుత్వ పథకాలన్నీ అమలవుతాయని చిగురుమామిడి ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ముదిమానిక్యం, నవాబుపేట్ గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ కోడలు డాక్టర్ హర్షిణి, జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ మంకు స్వప్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్ఎస్, బీజేపీ



చొప్పదండి: మాట్లాడుతున్న మేడిపల్లి సత్యం



జమ్మికుంట: కూలీలతో మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి: పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్, బీజేపీలు ప్రజా సంక్షేమాన్ని విస్మరించాయని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విమర్శించారు. కాట్నపల్లిలో గురువారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ తార, డీసీసీ అధ్యక్షుడు కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: దళితుల సంక్షేమానికి కృషి చేసే పార్టీ కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని, దళితులు ఐక్యంగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపి ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కోరారు. షానగర్ గ్రామ పరిధిలో ఉన్న ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో చొప్పదండి నియోజకవర్గ స్థాయి దళితుల ఆత్మీయ సమ్మేళనం సమావేశం ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా నిర్వహించారు. రామడుగు ఎంపీపీ జవ్వాజీ హరీశ్, మాజీ ఎంపీపీ తడగొండ అంజలి తదితరులు పాల్గొన్నారు.

దేశరాజ్‌పల్లిలో..

దేశరాజ్‌పల్లిలో ఎమ్మెల్యే సత్యం వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

జమ్మికుంట: ప్రజలకు సంక్షేమ పథకాలందించే కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. కొరపల్లి, మడిపల్లి, విలాసాగర్, వావిలాల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

చిగురుమామిడి: నవాబుపేట్ గ్రామంలో కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. గ్రామ అధ్యక్షుడు ఇనుగాల శ్రీనివాస్‌రెడ్డి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పోలు స్వప్న తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: ఎలబాక, బోంతుపల్లి, ఘనుముక్కల గ్రామాల్లో వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ఆయన కుటుంబ సభ్యులు వెలిచాల రుక్మిణి, అన్నపూర్ణ ప్రచారం నిర్వహించారు. సాహెబ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార కార్‌జాత జమ్మికుంట పట్టణానికి చేరుకోగా.. కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు. వర్ణవెంకట్‌రెడ్డి, గిట్ల ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: మత రాజకీయాలు చేసే బీజేపీని ఓడించి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి కోరారు. అన్నారం, దేవంపల్లి, కొండపల్కల గ్రామాల్లో జోన్ కార్యదర్శి సుంకరి సంపత్ సమక్షంలో ప్రచారం నిర్వహించారు.

హుజూరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు రామారావు వెంకటేశ్ కోరారు. వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరుతూ పట్టణంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ముత్త రాజు తదితరులున్నారు.

శంకరపట్నం: కాంగ్రెస్‌కు మద్దతుగా సీపీఐ నాయకులు మండల కేంద్రంలో ప్రచారం చేపట్టారు. పిట్టల సమ్మయ్య, సదానందం, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతులపై కాంగ్రెస్‌ది కపట ప్రేమ

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



సిర్సపల్లిలో మాట్లాడుతున్న గంగాడి కృష్ణారెడ్డి

హుజూరాబాద్‌రూరల్: రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం కపట ప్రేమను చూపుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. సిర్సపల్లి గ్రామంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు బీజేపీ పార్లమెంట్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల కరపత్రాలను పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు కుమార్, అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతంరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు సింగిరాల రామరాజు, మండల ఉపాధ్యక్షులు ఇనకొండ తిరుపతిరెడ్డి, మర్రి రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి పారిపెల్లి కొండాల్‌రెడ్డి తదితరులున్నారు.

జమ్మికుంట: శాయంపేట గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంపెల్లి సంపత్‌రావు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అకుల రాజేందర్ ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కు మద్దతుగా గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పుప్పాల రఘు, బూత్ అధ్యక్షుడు సుంకరి శ్రీనివాస్, రాచపల్లి రాజయ్య, వ్యామ రవీందర్, పంజాల రవీందర్, శ్రావణ్, సంతోష్, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: సీతారాంపూర్‌లో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పైడిపెల్లి శ్రీనివాస్, అమరగాని ప్రదీప్, చంద్రశేఖర్‌రెడ్డి, గునుకుల మధుసూదన్‌రెడ్డి, శ్యాంసుందర్, ఆడేపు సాగర్, హరి, శివ, అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

నమూనా బ్యాలెట్ ప్రదర్శన



కరీంనగర్‌టౌన్: నగరంలోని 17, 18, 19, 39వ డివిజన్ల బీజేపీ ఇన్‌చార్జి జాడి బాల్‌రెడ్డి గురువారం శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు, కో-ఆర్డినేటర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నమూనా బ్యాలెట్ ప్రదర్శించారు. పార్టీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కి ఒకటో నంబర్ గుర్తు కమలం పువ్వుపై ఓటు వేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. నాయకులు వెంకటస్వామి, పొన్నాల రాములు, పర్వతం మల్లేశం, గుండారం సంపత్, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీరాజం, విష్ణుప్రసాద్‌రావు, మైపాల్‌రెడ్డి, నాంపల్లి శంకర్, బండ రాకేశ్, గంట నరసింహారెడ్డి, చంద్రగిరి వేణు, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో చొప్పదండి నియోజకవర్గ సెక్టార్ ఆఫీసర్లు, ఈవీఎంలు డిస్ట్రిబ్యూషన్ చేసే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సెక్టార్ అధికారులు పోలింగ్ రోజున అన్ని ఏర్పాట్లు సరి గా ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఈ నెల 13న ఆరు గంటలకే సిబ్బంది మాక్ పోలింగ్ నిర్వహించాలని, ఏవైనా ఈవీఎంలు సక్రమంగా పనిచేయకపోతే వెంటనే మార్చాలని తెలిపారు. చెక్ లిస్ట్ ప్రకారం సిబ్బంది ఈవీఎంలు, మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ చేయాలని సూచించారు. బ్యాలెట్ యూని ట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్స్, తగిన మెటీరియల్ అంతా సక్రమంగా అందజేయాలన్నారు. అనంతరం ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. చొప్పదండి, రామడుగు తహసీల్దార్లు నరేందర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.